క్లుప్తంగా

దివ్యాంగుడికి మంత్రి చేయూత



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన సొప్పరి రవికి గల అంగవైకల్యం గురించి ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ వినీలారాణి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటస్వామి మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించి నిరంజన్‌రెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సొప్పరి రవికి మంగళవారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో మూడు చక్రాల స్కూటీని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి, మండల బీఆర్ఎస్ నాయకులకు రవి కృతజ్ఞతలు తెలిపారు.

నీరసం తెప్పించిన నిరీక్షణ..!



వనపర్తి: ఘనపురం బ్రాంచ్ కెనాల్ కోసం భూము లు ఇచ్చిన రైతులు పరిహారం విషయమై కలెక్టర్‌ను కలిసేందుకు మంగళవారం ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లి రైతులు వచ్చారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఉండటంతో రైతులకు సుమారు మూడు గంటలపాటు నిరీక్షణ తప్పలేదు. కనీసం విజిటర్స్ కోసం ఏర్పాటు చేసిన హాల్ వద్దకు కూడా సెక్యూరిటీ సిబ్బంది రానివ్వకపోవటంతో చాలా సమయం రైతులు కలెక్టరేట్ భవనం మెట్లపై కూర్చొని కనిపించారు. ఏమిటి సమస్య అని 'సాక్షి' ప్రశ్నిస్తే.. కెనాల్ నిర్మాణానికి భూములు ఇచ్చాం. ధర పెంచాలని కలెక్టర్‌కు విన్నవించేందుకు వచ్చామని వారు చెప్పారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

వనపర్తి: ప్రభుత్వ ఆదేశానుసారం ఆధార్ కార్డు పొంది పదేళ్లు దాటిన వారందరూ.. ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే, జూన్ లో పల్లె, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

గొర్రెల పంపిణీపై అవగాహన సదస్సు



పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెలు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. లబ్ధిదారులంతా ప్రభుత్వం అందించే సబ్సిడీ గొర్రెలను తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని పశువైద్యాధికారి డా.మధు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గొర్రెల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరను యూనిట్ ధరకు డీడీలు చెల్లించి గొర్రెలను పొందాలని సూచించారు. జెడ్పీటీసీ గౌరమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం గొల్లకురువల సంక్షేమం కోసం గొర్రెల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, నాగరాజు, రాముడు, బీరయ్య, మాసయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం వాయిదా

కొల్లాపూర్: నియోజకవర్గంలో మంగళవారం నుంచి చేపట్టాల్సిన ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం వాయిదా వేసినట్టు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ వెల్లడించారు. అకాల వర్షాల కారణంగా కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. మళ్లీ ఎప్పటి నుంచి కార్యక్రమం ప్రారంభించాలనే అంశాన్ని పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడి నిర్ణయిస్తామని తెలియజేశారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



కోడేరు: మండలంలోని రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఈఓ మధుసూదన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు దుక్కులు దున్నేటప్పుడు భూసార పరీక్షలు చేయించుకుని అధిక దిగుబడి పొందాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి పంటలు సాగు చేసుకుంటే అధిక లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో రైతులు స్పైలాబ్, స్వామి, ఉమ్మర్, దాసు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అరిగోస



బెక్కెంలో మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు అపార నష్టం వాటిల్లిందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మద్దిగట్ల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని మిరాసిపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న పంటలు, వరికుప్పలను మంగళవారం ఆయన పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిరాసిపల్లిలో నేటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని, 15 రోజుల నుంచి రైతులు ధాన్యాన్ని కుప్పలుగా పోసుకున్నారని తెలిపారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఉంటే ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసేది కాదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వరికొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ భరత్‌భూషణ్, మిరాసిపల్లి ఎంపీటీసీ శైలజ, పీఏసీఎస్ డైరెక్టర్లు నీలవర్ధన్, ఇందిరమ్మ, బీజేపీ నాయకులు శివ శంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మొగులయ్య, శేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, బాబాసాగర్, రాజునాయక్, వెంకటయ్య, అంజినాయక్, గట్టు కురుమయ్య, రాంచంద్రయ్య, రాములు, శ్రీను, జంపన్న, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

చిన్నంబావి: మండలంలోని బెక్కెం గ్రామంలో వరి, పప్పు శనగల కొనుగోలు కేంద్రాలను మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో స్పందించి వడ్లను కొనని కారణంగా వడ్లు, శనగలు వర్షానికి తడిచి మొలకలు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే వడ్లను కొనాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వెలగొండలో కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి నెల రోజులు గడుస్తున్నా వాటిని కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోయారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగ్గరి శ్రీధర్‌రెడ్డి, కుర్మయ్య, చెన్నయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో నష్టపోయిన రైతులు

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో భారీగా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన వరి పంటలు మామిడి తోటల్లో కాయలు రాలడంతో రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, వీపనగండ్ల తదితర గ్రామాలలో జూరాల కాలువ కింద సాగు చేసిన వరి పంట కోసుకునే దశలో అకాల వర్షాలతో నేల వాలడంతో రైతులు దిక్కుతోచని స్థితిలోకి పడిపోయారు. ఈదురు గాలులకు మామిడి కాయలు రాలడంతో రూ.లక్ష నష్టపోతున్నామని రైతులు వాపోయారు. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని గోవర్ధనగిరికి చెందిన రైతు దర్వేశ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

అమరచింత: మండలంలోని మస్తీపురం, కిష్టంపల్లి, నందిమళ్ల ఎక్స్‌రోడ్, నందమళ్ల, మిట్టనందిమళ్ల, చంద్రగఢ్, ఈర్లదిన్నె తదితర గ్రామాల్లో అకాల వర్షాలకు వరి పంటలు నేలకొరిగాయి. పంట కోతల సమయం సమీపించిందని సంతోషపడిన రైతులు తడిసిన పంట పొలాలను చూసి కన్నీరు పెట్టుకుంటున్న పరిస్థితులు దాపరించాయి. మండల వ్యాప్తంగా సుమారు ఐదు వందల ఎకరాల వరిపంట వర్షానికి దెబ్బతిందని రైతులు తెలిపారు. నామమాత్రంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ఇప్పటి వరకు ధాన్యం కొనట్లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



గోవర్ధనగిరిలో నీటమునిగిన వరిపంటను చూపుతున్న దర్గేశ్

పెబ్బేరు: మండల వ్యాప్తంగా మంగళవారం కురిసిన అకాల వర్షానికి నేలకొరిగిన వరి పంటలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రూ.వేలు పెట్టుబడి పెట్టి, పంట చేతికొచ్చే సమయంలో వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో కన్నీరుమున్నీరు అవుతున్నారు.

పాన్‌గల్: మండలంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు వాపోతున్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా తేమ పేరుతో తూకం వేయకపోవడంతో వర్షానికి ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కేంద్రాల్లో తూకం చేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు చేరావేయాలంటే అకాల వర్షాలతో లారీలు రావడానికి జంకుతున్నారు. ఒక వేళ లారీలు వస్తే అనుకోకుండా లారీలు బురదలో కూరుకుపోతే దానికి అయ్యే ఖర్చులు కూడా రైతులే భరించాల్సిన పరిస్థితి నేలకొందని వాపోతున్నారు.



మిరాసిపల్లిలో..



బుసిరెడ్డిపల్లిలో ..



బున్యాదిపూర్‌లో నేలకొరిగిన వరి పంట



కిష్టంపల్లి కొనుగోలు కేంద్రం వద్ద..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్ల, మద్దిగట్ల గ్రామాలకు చెందిన సత్యమ్మకు రూ.22వేలు, మహేశ్వరికి రూ.17500లు, రాధమ్మకు రూ.22,500 ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులు మంజూరు కాగా మంగళవారం నిరంజన్‌రెడ్డి బాధితులకు అందజేశారు. సీఎం రిలీఫ్‌ఫండ్ డబ్బులు వచ్చేందుకు కృషి చేసిన వైస్ ఎంపీపీ రఘుప్రసాద్, రామన్‌గౌడ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వాల్‌పోస్టర్ల విడుదల



పెబ్బేరు రూరల్: బీఎస్పీ ఆధ్వర్యంలో తెలంగాణ భరోసా సభ వాల్‌పోస్టర్‌ను వనపర్తి జిల్లా బీఎస్పీ కన్వీనర్ బహుజన రమేష్ మంగళవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 తేదీన హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ భరోసా సభలో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి పాల్గొంటున్నందున మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గూడెం ఎల్లస్వామి, నాయకులు ఆర్సీ భీసన్న, శ్రీనివాస్, భాస్కర్, రమేష్, లక్ష్మణ్, ముని తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: హైదరాబాద్‌లో ఈ నెల 7న బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేసేందుకు బహుజనులంతా కలిసి రావాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి మొల్గర తిర్మలేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఎస్పీ మండల అధ్యక్షుడు గోపి ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ భరోసా సభ వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కో కన్వీనర్ రమేష్, మన్నెం, భీమ్ రాజ్, దేవేందర్, యాదయ్య, రామకృష్ణ, రమేష్, సత్యయ్య తదితరులు పాల్గొన్నారు

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు



కొత్తకోటలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తకోట: కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భవన ఇతర నిర్మాణ కార్మికులకు మున్సిపల్ కార్యాలయంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, షుగర్, చెవి, కంటి పరీక్ష, ఊపిరితిత్తుల పనితనం, మూత్ర, గుండె పరీక్షతో పాటు మిగతా పరీక్షలను వైద్యుల పర్యవేక్షణలో చేసి సలహాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా లేబర్ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ.. బీఓసీ కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే కార్మిక శాఖ తరఫున రూ. లక్షతో పాటు దహన సంస్కారాల కోసం రూ. 30 వేలు అందుతాయని తెలిపారు. అంతేగాక కార్మిక శాఖ నుంచి ఆడ పిల్లల వివాహ సమయంలో రూ. 30 వేలు ఇవ్వనున్నట్లు ఆయన వెల్లండారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుఖేశిని, కమిషనర్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్, వైద్యులు దశరథం, జిల్లా కోఆర్డినేటర్ నరేష్, క్యాంపు కోఆర్డినేటర్ భాస్కర్, భవన నిర్మాణ కార్మికులు వెంకటయ్య, దుప్పటి శ్రీను, కురుమూర్తి, చిన్న ఆశన్న, రవిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన జూపల్లి వర్గీయులు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మండల నాయకులు

పాన్‌గల్: కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో మండలానికి చెందిన జూపల్లి వర్గీయులు మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేతేపల్లికి చెందిన సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, రాజాపూర్‌కు చెందిన నాగేశ్వర్‌రెడ్డి, జమ్మాపూర్‌కు చెందిన సురేష్‌శెట్టి, వార్డు సభ్యులు అన్నెరాముడు, ఎస్ఎంసీ చైర్మన్ లింగస్వామి ఆధ్వర్యంలో 15 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీలోకి చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, రైతు బంధు మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, జ్యోతినందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష రద్దు

వనపర్తి టౌన్: ఓపెన్ ఇంటర్‌లో మంగళవారం నిర్వహించాల్సిన ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్ష రద్దయింది. దీనిపై అధికారులు మాట్లాడుతూ కేవలం ఇంగ్లిష్ మీడియం పరీక్ష పత్రాలు మాత్రమే వచ్చాయని తెలుగు మీడియం పరీక్షా పత్రాలు కేంద్రానికి చేరలేదు. పోలీస్‌స్టేషన్‌లోని బల్క్ పాయింట్‌లో కూడా లేకపోవడంతో ఉన్నతాధికారులు ఇంగ్లిష్ మీడియం పేపర్‌నే తెలుగులో ట్రాన్స్‌లేట్ పరీక్ష రాయించాలని సూచించారు. కానీ రాష్ట్ర వాప్తంగా ఇదే సమస్య ఉత్పన్నం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్ష రద్దు చేశామని, తిరిగి ఈ నెల 13న పరీక్ష నిర్వహిస్తామని పరీక్షల నిర్వహణ అధికారి మధుకర్ తెలిపారు. తెలుగు మీడియం పరీక్షను రద్దు చేసిన అధికారులు ఇంగ్లిష్, ఉర్దూ మీడియం పరీక్షలు యధావిధిగా నిర్వహించారు.

రూ.50 వేల విరాళం అందజేత

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవానికి కొల్లాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతలపల్లి జగదీశ్వర్ రావు రూ.50 వేలను ఆలయ ప్రారంభోత్సవానికి ఆలయ కమిటీ పెద్దలకు విరాళంగా ఇచ్చారు. మున్ముందు ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. సుదర్శన్, సత్యనారాయణ, రాము, మోహన్ పాల్గొన్నారు.



'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



బండపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోని కంటి పరీక్షలను చేయించుకోవాలని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్ అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో మంగళవారం ప్రారంభించిన కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అవసరమైన వారికి అద్దాలు ఇస్తామన్నారు. ఆధార్ కార్డును వెంట తీసుకొచ్చి తమ వివరాలను నమోదు చేసుకోని కంటిపరీక్షలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పావని, డాక్టర్ నిస్సార్‌అహ్మద్, డాక్టర్ దీపిక, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బండపల్లిలో..

పాన్‌గల్: మండలంలోని బండపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ప్రేమ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంమూర్తినాయుడు, ఉప సర్పంచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం



కొల్లాపూర్: పట్టణంలోని ముదిరాజ్ సంఘ భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని తహసీల్దార్ శివ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిన ముదిరాజ్ సంఘం నాయకులను ఆయన అభినందించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువత ఈ ఆటను నేర్చుకునేందుకు ఈ శిబిరం దోహదపడుతుందన్నారు. ఆర్ఐ.గోవిందరెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు కుమారస్వామి, బిచ్చయ్య, సుధాకర్ తదితరులున్నారు.

ముంచెత్తిన వాన: జన జీవనం అస్తవ్యస్తం



ఆత్మకూర్‌లోని ఎస్వీఎస్‌స్కూల్ వద్ద నిలిచిన వర్షపునీరు

ఆత్మకూర్: అకాల వర్షానికి పట్టణంలోని వీధులు, రహదారులు జలమయం అయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున నుంచి ఉదయం 10గంటల వరకు కురిసిన వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో వర్షపునీరు ఇళ్లల్లోకి చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఇళ్లల్లోని వస్తువులన్నీ వర్షం నీటికి తడిసి పోయాయయి. మున్సిపాలిటీలో 24 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. తాగునీటి సరఫరా సైతం ఆగిపోయింది.

కూలిన మట్టిమిద్దె

పెబ్బేరు రూరల్: సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో కురుమయ్య, శివాల చరణ్ కు చెందిన ఇంటి మట్టి మిద్దె కూలింది. ఇంటి యజమాని కురుమయ్య మాట్లాడుతూ తమకు నివాసం ఉండేందుకు వేరే ప్రత్యామ్నాయం లేదని, ప్రభుత్వం కరుణించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు. స్పందించిన సర్పంచ్ ఆంజనేయులు గ్రామంలో కూలిన ఇళ్లను పరిశీలించి, వారికి ప్రభుత్వం నుంచి సహాయం అందే విధంగా ప్రయత్నిస్తానన్నారు.

కోతకు గురైన బీటీ రహదారి

అమరచింత: వర్షాల కారణంగా మస్తీపురంలోని బీటీ రహదారి కోతకు గురైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు గుంతలమయమైన రహదారిపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మస్తీపూర్‌లో బీటీ రహదారి కోతకు గురికావడంతో జూరాల ప్రాజెక్టు మీదుగా గద్వాలకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదు. మస్తీపూరం ఎక్స్‌రోడ్ నుండి జూరాల ప్రాజెక్టు వరకు బీటీ రహదారి వెడల్పును చేపట్టాల్సిన అధికారులు ప్రస్తుతం మస్తీపూరం శివారు వరకే బీటీ వేసి వదిలి వేయ్యడంతో ప్రాజెక్టు రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. ప్రస్తుతం వరి కోతలు, వరిధాన్యం కొనుగోలు, తరలింపులతో వాహన రాకపోకలు జరుగుతున్న రహదారిలో ఇలా కోతకు గురికావడం రైతుల్లో దడ పుట్టిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.



నాగసానిపల్లిలో..



ఆత్మకూర్‌లోని సాయిబాబ ఆలయం వద్ద..



మస్తీపురంలో కోతకు గురైన బీటీ రహదారి

దర్జాగా అక్రమ దందా



ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

- అనుమతుల మాటున ఇసుక అక్రమ రవాణా
- ప్రభుత్వ పనులకు పర్మిట్లు, ప్రైవేట్‌గా విక్రయం
- తెర వెనుక రాజకీయ నాయకుల మంత్రాంగం

చిన్నంబావి: మండలంలో అనుమతుల ముసుగులో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ పనుల పేరుతో ప్రైవేట్ పనులకు తరలిస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. కొందరు రాజకీయ నాయకులు ఈ మంత్రాంగం నడిపిస్తుండగా అధికారులు చూసిచూడనట్లు వదిలేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు అనేక మార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తూంకుంట వాగు నుంచి..

చిన్నంబావి మండలంలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో వీపనగండ్ల మండలంలోని తూంకుంట వాగు నుంచి రోజూ పదుల సంఖ్యలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. నిబంధనలకు పాతర వేస్తూ అక్రమ రవాణాతో ప్రభుత్వం ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. వీపనగండ్ల మండలంలోని తూంకుంట వాగు నుంచి చిన్నంబావి మండలంలోని పలు గ్రామాలకు ఇసుక కావాలంటే ప్రభుత్వ నిబంధనలతో రూ.2,500లకు ఒక ట్రిప్పు ఇసుకను తరలించాలి. కానీ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఒక ట్రాక్టర్ ట్రిప్పు ఇసుక ను రూ.3,500 నుంచి రూ.4,500 దండుకుంటూ రూ.వేలల్లో ఆర్జిస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నా ఇటు రెవెన్యూ, అటు మైనింగ్, పోలీసు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఉన్నతాధికారులకు అజ్ఞాత వ్యక్తులు సమాచారం అందించే సమయంలో మాత్రం హడావుడి చేసి తరువాత అక్కడ ఏమి జరగలేదన్నట్లు మిన్నుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల చేతివాటం ప్రదర్శిస్తుడటంతో ఇసుకాసురుల పని మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఉందని ప్రజలు బహిరంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరికైనా ఇసుక కావాలంటే ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెడతాం.

– ఘన్సీరాం నాయక్, తహసీల్దార్, చిన్నంబావి